క్లుప్తంగా

హక్కుల వేలం తేదీ మార్పు

నందిగామ: స్థానిక సత్యమ్మ అమ్మవారి ఆలయం వద్ద కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కుల కోసం ఈనెల 18వతేదీ మంగళవారం నిర్వహించాల్సిన వేలం బుధవారానికి వాయిదా పడినట్లు ఆలయ ఈవో పి.సీతారామయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచినవారు ఈ మార్పును గమనించాలని ఆయన కోరారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవ వేడుకలు



నందిగామ: స్థానిక చెరువు బజార్‌లోని సాయిబాబా మందిర 23వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. మూడు రోజుల పాటు జరిగిన వేడుకలలో భాగంగా చివరి రోజు స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. పూర్ణాహుతి నిర్వహించడంతోపాటు భక్తులకు అన్నదానం చేశారు. ఆయా పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా గరుడసేవ



వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారికి గరుడసేవ కార్యక్రమాన్ని శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. నవమి సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై ఉంచి ఆలయ ఆవరణలో ఊరేగించారు. అర్చకులు వేదాంతం యోగానందాచార్యులు, మురళీధరాచార్యులు, వేణుమాధవాచార్యుల పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. గరుడసేవలో సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సూర్యభగవానుడికి గులాబీలతో అర్చన




మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ శివజ్ఞాన పీఠంలో ఆదివారం సూర్యభగవానునికి గులాబీలతో అర్చనలు నిర్వహించారు. పీఠాధిపతి శివచార్య స్వామి సూర్యభగవానునికి విశేషంగా పూజలు, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దీంతో ఆలయంలో కోలాహలం నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అవ్వడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోసాలకు చెందిన వంగూరి శివశంకర్‌రావు నలందా కాలేజీలో బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతను శనివారం ఆటోలో వస్తుండగా గంగూరు చేపల కుండీల వద్ద ఆటో ఆగింది. వెనుక నుంచి వచ్చిన టిప్పర్ లారీ అతివేగంగా వచ్చి ఆటోను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆటో పల్టీ కొట్టగా ఆటోలో ఉన్న శివశంకర్‌రావుకు గాయాలయ్యాయి. అతడిని 108 వాహనంలో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకై చేర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘాటెక్కిస్తున్న మిర్చి విత్తనం ధరలు

- కృతిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు
- ఆందోళనలో రైతులు
- ధరలను నియంత్రించాలని డిమాండ్



మిరప విత్తనాలు

వత్సవాయి : మిరప విత్తనాల ధరలు రైతులకు మంటెత్తిస్తున్నాయి. వాణిజ్య పంటలలో ప్రధానమైన మిర్చి పంటను సాగుచేసేందుకు రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. దీంతో మార్కెట్లో మంచి విత్తనాన్ని కొనుగోలు చేసేందుకు రైతులు పరుగులు పెడుతున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో జగ్గయ్యపేట నియోజకవర్గంలో 9వేల హెక్టార్లలో మిరప పంటను సాగుచేయగా ఈ ఏడాది విస్తీర్ణం కొద్దిమేర తగ్గే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఎమ్మార్పీపై 30శాతం అదనం..

మిరప సాగును డిమాండ్‌లో ఉంచుకున్న వ్యాపారులు విత్తనాల ధరలను అమాంతం పెంచేశారు. ఆయా విత్తనాలకు రైతుల నుంచి ఎమార్పీ ధర కంటే 30శాతం అధికంగా వసూలు చేస్తున్నారు. లేదంటే విత్తనాలకు అందుబాటులో లేకుండా చేసి కృతిమ కొరత సృష్టిస్తున్నారు. తద్వారా విత్తనాలకు డిమాండ్ పెరిగేలా వ్యవహరిస్తున్నారు. దీంతో రైతులు తొందరపడి అధికధరను వెచ్చించి మరీ విత్తనాలను కొనుగోలు చేయక తప్పని పరిస్థితిని పలువురు వ్యాపారులు కల్పిస్తుండటం గమనార్హం.

పలు కంపెనీల విత్తనాలకు డిమాండ్...

ప్రముఖ కంపెనీల విత్తనాలకు గతంలో ఎన్నడూ లేనంత విధంగా డిమాండ్ పెరుగుతోంది. పొలంలో నేరుగా ఎదపెట్టే కేజీ విత్తనాల ఎమ్మార్పీ ధర రూ.700 ఉండగా కొందరు వ్యాపారులు రూ.1500 వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. అదే ఒక్క మొక్క నారును పెంచి పొలంలో నాటుకునే 4884, 577, తేజ, అన్నదాత, సాక్షి, ఆర్మూరు, క్లాసిక్, లావు రకం వంటి రకం విత్తనాలు మార్కెట్‌లో కేజీ విత్తనం ధర రూ.30వేలు నుంచి ఒక లక్ష వరకు ధరలు పలుకుతున్నాయి. రైతులు ఆసక్తిచూపుతున్న విత్తనాలకు మరింత డిమాండ్ సృష్టించి అదనంగా వసూలు చేస్తున్నారు. గత సీజన్‌లో అధిక దిగుబడులు సాధించిన విత్తన రకాలనే రైతులు అడుగుతుండటంతో ధరలు పెరిగిపోతున్నాయి. ముందుగా తీసుకోండి లేకపోతే నాణ్యమైన విత్తనం దొరకదని పలువురు వ్యాపారులు రైతులను మభ్యపెడుతూ వారికి అధికధరలకు విత్తనాలను అంటగడుతున్నారు. అధికరేట్ల గురించి ప్రస్తావిస్తే రేటు ఇంతే మీఇష్టం అయితే తీసుకువెళ్లండి లేకుంటే లేదంటూ గడసరి సమాధానాలు చెబుతున్నారు.

కనిపించని స్టాక్‌బోర్డులు...

జగ్గయ్యపేట నియోజకవర్గంలో అనుమతులు ఉన్న విత్తనాల షాపుల కంటే సరైన అనుమతులు లేకుండా విత్తనాలు విక్రయించేవారి సంఖ్యే అధికంగా ఉంది. కొన్ని కంపెనీలకు చెందిన ప్రతినిధులు కొంతమంది రైతులను ఎంపిక చేసుకుని వారి వద్ద నుంచి మిగతా రైతులకు అమ్మకాలు సాగిస్తున్నారు. వారు రైతులకు కనీసం రశీదులు కూడా ఇవ్వడం లేదు. అనుమతులు ఉన్న డీలర్లు షాపుల ఎదుట స్టాక్‌బోర్డులు ఉంచకపోవడం గమనార్హం. వ్యవసాయాధికారులు సైతం ఆయా విత్తనాలు, ఎరువుల దుకాణాలను తూతూమంత్రంగా తనిఖీలు చేసి మమ అనిపిస్తుండటం పలువురు వ్యాపారుల పాలిట వరంగా మారిందనే చెప్పాలి. దుకాణాదారులు స్టాక్ వివరాలతో కూడిన బోర్డులు పెట్టకపోవడంలో వ్యవసాయాధికారుల ఉదాసీన వైఖరి కూడా ఓ కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా వ్యవసాయాధికారులు స్పందించి విత్తనాలను ఎమ్మార్పీ ధరలకే అమ్మేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు..



విత్తనాలను అధిక ధరలకు విక్రయించే దుకాణాదారులపై చర్యలు తీసుకుంటాం. అధిక ధరలకు విక్రయించేవారి సమాచారాన్ని తెలియజేస్తే, దాడులు నిర్వహిస్తాం. సమాచారం తెలిపేవారి పేర్లను గోప్యంగా ఉంచుతాం. రశీదు తీసుకోకుండా విత్తనాలు కొనుగోలు చేయవద్దు. రశీదులను పంట పూర్తయ్యేవరకు రైతులు జాగ్రత్తగా భద్రపరచుకోవాలి.

వి రవికుమార్, వ్యవసాయాధికారి

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



శ్రీతిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవుదినం కావడంతోపాటు శుభకార్యాలు ఉండటం, పాఠశాలలు, కళాశాలలు ఇంకా పూర్తి స్థాయిలో ప్రారంభంకాకపోవటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. భారీగా తరలివచ్చిన భక్తులతో పెనుగంచిప్రోలు జనసంద్రమైంది. వేకువ జాము నుంచే భక్తులు పాలు,పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తుల వాహనాల రద్దీగా ట్రాఫిక్ ఇక్కట్లు తప్పలేదు. మధ్యాహ్న సమయంలో భక్తులు మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.



భక్తులతో కిక్కిరిసిన క్యూలైన్లు



అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

వరుణ దేవా...కరుణ చూపవా

వర్షాల కోసం రైతన్నల ఎదురుచూపులు



వరుణుడి కటాక్షం కోసం ఆశగా ఆకాశం వైపు చూస్తున్న రైతు

నందిగామ: నందిగామ ప్రాంతంలో ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితులు రైతుల్లో గుబులు రేపుతోంది. జూన్ మాసం మూడోవారంలోకి ప్రవేశించినా, అదను దక్కకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. రుతుపవనాల రాక రోజురోజుకు ఆలస్యమవుతుండటంతో సాగుకాలం దాటిపోతుందన్న భయం వారిని వెంటాడుతోంది. సాధారణంగా ఈపాటికే వాతావరణం చల్లబడాల్సి ఉంది. అయితే ఈ ఏడాది అందుకు భిన్నంగా సూర్య ప్రతాపం కొనసాగుతోంది. జూన్ నెలలో సైతం ఎండలు మే నెలను తలపిస్తున్నాయి. దీంతో సాగుకు అనువైన పరిస్థితుల కోసం అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్ ఆలస్యమైతే, రెండో పంట సాగు మరింత ఆలస్యమవుతుందన్న ఆందోళన రైతుల మాటల్లో వ్యక్తమవుతోంది. వర్షాలు ఎప్పుడు కురుస్తాయో తెలియక రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు.

సాగువిస్తీర్ణం 34,483 హెక్టార్లు..

నందిగామ నియోజకవర్గంలో మొత్తం 34,483 హెక్టార్ల సాగు భూమి ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. గతేడాది 13,469 హెక్టార్లతో పత్తి, 5,866 హెక్టార్లలో వరి, 3,585 హెక్టార్లలో మిర్చి పటను రైతులు సాగుచేశారు. మిగిలిన విస్తీర్ణంలో మొక్కజొన్న, పసుపు, కందులు, కాయగూరలు, ఆకు కూరలు సాగు చేశారు. ఈ ఏడాది కూడా సాగు విస్తీర్ణం గతేడాదిస్థాయిలోనే ఉండవచ్చునని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే విత్తనాలను సైతం కొనుగోలు చేసి సిద్ధంగా ఉన్నారు. పత్తిసాగుకు సన్నాహాలు చేసుకుంటూ రైతులు, వర్షాల కోసం ఆకాశంవైపు ఆశగా ఎదురు చూస్తున్నారు.

పెనుగంచిప్రోలులో ట్రాఫిక్ కష్టాలు



కాజ్‌వేపై నిలిచిపోయిన వాహనాలు

పెనుగంచిప్రోలు: గ్రామంలో శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం వేలాది మంది భక్తులు వాహనాల్లో తరలిరావడంతో గ్రామంలో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది వాహనాల్లో భక్తులు తరలివచ్చారు. భక్తుల వాహనాలతో ఆలయ పరిసరాలతోపాటు పెనుగంచిప్రోలు రోడ్లన్నీ నిండిపోయాయి. పోలీస్‌స్టేషన్ సెంటర్ నుంచి ఆలయం వరకు, చెరువుకట్ట, డౌన్ సెంటర్, మునేరు కాజ్‌వే నాలుగు రోడ్లు వాహనాలు నిలిచిపోవటంతో ట్రాఫిక్ నియంత్రిచేందుకు గంటల సమయం పట్టింది. పోలీసులతోపాటు వాహనదారులు కూడా ట్రాఫిక్ నియంత్రణలో పాల్గొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ట్రాఫిక్ కొనసాగింది. ముఖ్యంగా ఆది, శుక్రవారాలు, సెలవు దినాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలివస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఇకనైనా ఆలయ, పోలీసు అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



నాలుగురోడ్ల కూడలి పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో ట్రాఫిక్ పరిస్థితి



విజయవాడ రోడ్డు వైపు నిలిచిపోయిన వాహనాలు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ హైమావతి

కంచికచర్ల : రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండటం ద్వారా ఆయా కేసుల నుంచి విముక్తి పొందాలని కంచికచర్ల ఎస్‌ఐ-2 హైమావతి సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ హైమావతి మాట్లాడుతూ రౌడీషీటర్లపై ఎప్పటికప్పుడు పోలీస్ నిఘా కొనసాగుతుందన్నారు. రౌడీషీటర్లు స్టేషన్ పరిధిలోనే ఉండాలన్నారు. అప్పుడప్పుడు స్టేషన్‌లో సంతకాలు చేయాల్సి ఉంటుందన్నారు. రౌడీషీటర్లు, సస్పెక్టెడ్ కేసులున్న వారి కదలికలపై అనుమానం వస్తే వెంటనే వారిని అదుపులోకి తీసుకుని బైండోవర్ చేస్తామని తెలిపారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే రౌడీషీటర్లను జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

వీరులపాడులో..

వీరులపాడు: నేరచరిత్ర కలిగినవారు సత్ప్రవర్తనతో నడుచుకోకపోతే కఠినచర్యలు తప్పవని ఎస్‌ఐ మహాలక్ష్మణుడు హెచ్చరించారు. వీరులపాడు పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టి, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నట్లు తెలిపారు. అల్లర్లు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పనులకు యత్నిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. సత్ప్రవర్తనతో నడుచుకునే వారిని గుర్తించి వారిపై ఉన్న రౌడీషీట్ తొలిగించేలా ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామన్నారు. అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని రౌడీషీటర్లకు సూచించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కంచికచర్ల : అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు, తరలింపునకు పాల్పడేవారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ పెంకె వెంకట సత్య సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. మండలంలోని మోగులూరు మున్నేటి నుంచి ఆదివారం తెల్లవారుజామున అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ మాట్లాడుతూ అక్రమంగా ఇసుకను తరలించే వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. ఇసుక ట్రాక్టర్లను పోలీసుస్టేషన్‌కు తరలించడంతోపాటు వాహన యజమాని, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో అగ్నిప్రతిష్ఠాపన

పెనమలూరు: పోరంకి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామివారి ఆలయంలో 20వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం ఆలయంలో అగ్ని ప్రతిష్ఠాపన చేశారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, యాగశాల ప్రవేశం, ఉదయం 10 గంటలకు అగ్నిప్రతిష్ఠాపన జరిగింది. సాయంత్రం 5 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం, శేషవాహన సేవ నిర్వహించారు. కాగా సోమవారం శ్రీశ్రీశ్రీ త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామివారి పర్యవేక్షణలో పంచామృత స్నపన, అష్టోత్తర శత కలశ స్నపన, 108 కలశాలతో అభిషేకం నిర్వహించనున్నారు. భక్తులు ఈ పూజా కార్యక్రమానికి హాజరుకావాలని ఆలయ అభివృద్ధి కమిటీ కోరింది.

వేదాద్రికి ఎమ్మెల్యే దంపతుల పాదయాత్ర



వేదాద్రికి పాదయాత్రగా వెళ్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్ దంపతులు, కార్యకర్తలు

జగ్గయ్యపేట అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారంలోకి రావడాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), ఆయన సతీమణి శ్రీదేవి(అమ్మాజీ) ఆదివారం జగ్గయ్యపేట నుంచి వేదాద్రిలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం వరకు పాదయాత్ర చేశారు. తొలుత పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి స్థానిక బంగారుకొట్ల సెంటర్ వద్ద ఉన్న శ్రీవిష్ణ్వేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి పాదయాత్ర చేపట్టారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలవడంతోపాటు ముఖ్యమంత్రిగా చంద్రబాబు, విజయవాడ ఎంపీగా కేశినేని శివనాథ్ (చిన్ని) విజయం సాధించడంతో వేదాద్రి వరకు పాదయాత్ర చేసి లక్ష్మీనరసింహస్వామి వారికి మొక్కు చెల్లించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు శ్రీరాం చినబాబు, శ్రీవల్లి పాల్గొన్నారు.

110 మందికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఫాదర్స్‌డేను పురస్కరించుకుని ఆదివారం రూట్స్ హెల్త్ ఫౌండేషన్, సోమలరాజ ఫౌండేషన్(బెంగళూరు) ఆధ్వర్యంలో హెచ్‌సీజీ క్యూరీ క్యాన్సర్ సెంటర్ సహకారంతో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అశోక్‌నగర్‌లోని సోమనాథ్ హాస్పిటల్‌లో నిర్వహించిన ఈ శిబిరంలో 45 ఏళ్లు నిండిన తల్లిదండ్రులకు పలు రకాల స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, ప్రోస్టేట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన సిద్ధార్థ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.రూప్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఖరీదైన క్యాన్సర్ పరీక్షలను ఉచితంగా చేస్తూ ఎంతో మందికి ఉపయోగపడుతున్న రూట్స్ సంస్థకు అభినందనలు తెలిపారు. సంస్థ చైర్మన్ డాక్టర్ పోలవరపు విజయభాస్కర్ మాట్లాడుతూ.. పురుషుల్లో వచ్చే ప్రోస్టేట్ క్యాన్సర్, మహిళల్లో వచ్చే సర్వైకల్ క్యాన్సర్‌లను పీఎస్‌ఏ, పాప్ స్మియర్ పరీక్ష ద్వారా ముందుగా గుర్తించవచ్చునన్నారు. క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ కె.రంగనాథ్, డాక్టర్ విజయేశ్వరిలు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. శర్మ, జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన బ్రహ్మోత్సవాలు



కల్యాణోత్సవాన్ని వీక్షిస్తున్న ఉభయ దాతలు, భక్తులు



శాంతి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకుడు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు



ఆలయ ప్రధాన కలశాలకు అభిషేకాలు



అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

కనులపండువగా కల్యాణోత్సవం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భీమన వారి పేటలోని శ్రీవిజయదుర్గా రామలింగేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో ఆదివారం ఉదయం పూర్ణాహుతి కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు లాంఛనంగా ముగిశాయి. ఉదయం ఎనిమిది గంటలకు ప్రధాన దేవతామూర్తులకు అనుష్ఠానం, పారాయణలు, హోమాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామి వారి ఆలయంతోపాటు ఇతర ఉపాలయాల కలశ స్థాపన, అభిషేకాలను ఆలయ అర్చకుడు పవన్‌కుమార్ శర్మచే వైభవంగా జరిపించారు.

భక్తులకు అన్న ప్రసాద వితరణ

ఆలయ ప్రాంగణంలో వాసురెడ్డి వెంకటేశ్వరరావు, శేషారత్నం దంపతులచే శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వార్ల శాంతి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మల పర్యవేక్షణలో అర్చకులు ఉత్సవ మూర్తులకు కల్యాణోత్సవాన్ని జరిపించారు.ఉభయ దాతలు, భక్తులు స్వామి వారి కల్యాణోత్సవాన్ని వీక్షించారు. అనంతరం భక్తులకు స్వామి వారి అన్న ప్రసాద వితరణ చేశారు. అల్లూరి గౌరీనాథ్ దంపతులచే ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు విశేషంగా తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.